సాక్షి కర్నూలు

ఆదివారం । 16 । జూన్ । 2024



సుంకేసులకు వరద నీరు

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 15,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అధికారులు రెండు గేట్లు పైకెత్తి 8,622 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.



మహానందిలో రద్దీ

మహానంది: మహానంది ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ నిత్యకళారాధన వేదికపై శనివారం హన్మకొండకు చెందిన శ్రీభద్రకాళి కూచిపూడి నృత్య కళాక్షేత్రం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

20 నుంచి ఐటీఐ సీట్ల కేటాయింపు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించి, 24న సీట్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఐటీఐ కాలేజీల కన్వీనర్ ఆర్.కృష్ణమోహన్ శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ సీరియల్ నంబర్ 1 నుంచి 292 వరకు, 21న 293 నుంచి 628 వరకు, 22న 629 నుంచి 986 సీరియల్ నంబర్ వరకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. జనరల్ పూల్‌లో మిగిలిన బాలికల సీట్లను బాలురుచే భర్తీ చేయనున్నట్లు చెప్పారు. భర్తీ కాని రిజర్వేషన్ సీట్లను కూడా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. సీట్లు పొందిన వారికి కాల్ లెటర్స్ / ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామన్నారు.

19, 20 తేదీల్లో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 19, 20వ తేదీల్లో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు డీఆర్వో కె.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ నేపథ్యంలో కరువు తీవ్రత తెలిజేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నెలకొన్న కరువును కేంద్ర బృందానికి కళ్లకు కట్టినట్లు చూపేందుకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ రూపొందించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులతో కేంద్ర బృందం మాట్లాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పంటలు నష్టపోయిన మద్దికెర, చిప్పగిరి, ఆలూరు మండలాల వ్యవసాయాధికారులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాకేంద్రంలో డీపీఆర్‌ఓ ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ హిమప్రభాకరరాజు, డీఆర్‌డీఏ పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కోడుమూరు రూరల్: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ ఎస్.సలీంబాషా సూచించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళల జీవనోపాధులు, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత, వ్యవసాయం, గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనపై కోడుమూరు, ఎమ్మిగనూరు, కర్నూలు, కోసిగి, హాలహర్వి, చిప్పగిరి, మద్దికెర, ఆదోని మండలాల ఏపీఎంలకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి సాధిస్తే ఆయా కుటుంబాలతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీధర్‌రావు, డీపీఎం అయ్యన్న, కోడుమూరు ఏపీఎం పుష్పావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

సొంత వైద్యం కొంత మానుకో!



కల్లూరుకు చెందిన ఓ యువకుడు కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ మెడికల్‌షాపునకు వెళ్లి శృంగారంలో శక్తిని పెంచే మాత్రలు అడిగి మరీ కొనుగోలు చేశారు. అతను అడిగిన వెంటనే దుకాణదారులు మందులు ఇవ్వడంతో వాటిని తీసుకుని ఓ లాడ్జికి వెళ్లాడు. మాత్రలు వేసుకుని శృంగారంలో పాల్గొనగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే లాడ్జి సిబ్బంది అతన్ని సమీప ఆసుపత్రికి తరలించి గుట్టుగా వైద్యం చేయించి పంపించారు.

కర్నూలు నగరానికి చెందిన ఓ మహిళ పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు రెగ్యులర్‌గా వచ్చే పీరియడ్స్ ఆటంకం అవుతాయని భావించింది. ఈ మేరకు మెడికల్ షాపులో సంప్రదించి మాత్రలు ఇవ్వాలని కోరింది. ఆమె కోరిన మేరకు మందుల దుకాణం వారు మాత్రలు ఇచ్చి పంపించారు. మందుల దుకాణదారులు చెప్పిన దానికి రెండింతల డోసు వేసుకున్న ఆమెకు తీవ్ర అస్వస్థతకు గురైంది. తీవ్రంగా కడుపునొప్పి రావడంతో సమీప ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఆమెకు గర్భసంచిలో ఇబ్బంది ఏర్పడిందని, దానిని తీసేయాలని వైద్యులు సూచించారు.

.. వీరే కాదు ఇటీవల కాలంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా మందుల దుకాణాలకు వెళ్లి అవసరమైన మందులను కొనుగోలు చేసి వాడుతున్నారు. సాధారణంగా దగ్గు, జ్వరం, జలుబు మందుల వరకు ఫరవాలేదు గానీ అంతకు మించి వ్యాధులకు నేరుగా కొనుగోలు చేసి వాడితే ఇబ్బందులు తప్పవంటున్నారు వైద్యులు. వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులు వాడకూడదని వారు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల కొన్నిసార్లు ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

- ఇష్టానుసారం వాడితే మొదటికే మోసం
- ప్రాణాల మీదకు తెస్తున్న సొంత వైద్యం
- డాక్టర్ వద్దకు వెళితే ఖర్చు అవుతుందని నిర్ణయం
- మెడికల్‌షాపుల్లో ఇష్టానుసారంగా విక్రయం
- చిన్నవ్యాధి నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు మందుల కొనుగోలు
- వైద్యుల సూచన లేకుండా వాడితే దీర్ఘకాలంలో ఇబ్బందులు



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2వేలకు పైగా రిటైల్ మెడికల్‌షాప్‌లు, 180కి పైగా హోల్‌సేల్ మందుల దుకాణాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం, పట్టణాల్లోని మురికివాడలతో పాటు ప్రధాన రహదారిల్లో కనిపించే దుకాణాల్లో సైతం వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా అన్ని రకాల మందులు విక్రయిస్తున్నారు. కోవిడ్ తర్వాత వైద్యుల ఫీజులు, వైద్యపరీక్షల ధరలు, ఆసుపత్రి ఖర్చులు పెరిగాయి. కొందరు వైద్యులు మాత్రమే కేవలం లక్షణాలను బట్టి వ్యాధినిర్ధారణ చేసి చికిత్స చేస్తున్నారు. అయితే అధిక శాతం వైద్యులు జ్వరం వచ్చిందని వస్తే చాలు వారికి వైద్యపరీక్షలు, మందులు కలిపి రూ.2వేలకు పైగా బిల్లు చేస్తున్నారు. ఈ ఖర్చులు భరించలేకే చాలా మంది నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి వ్యాధి లక్షణాలు చెప్పి మందులు కొంటున్నారు. కౌంటర్ సేల్స్‌కు అలవాటు పడ్డ కొన్ని దుకాణాల యజమానులు ఇలాంటి వారు కూడా వస్తే అదనంగా మరో పది రూపాయలు వస్తాయనే ఆశతో ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. ఇలాంటి మందుల్లో సాధారణ జ్వరం, జలుబు, దగ్గు మాత్రలతో పాటు విటమిన్లు, యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, శృంగారంలో శక్తిని పెంచే మాత్రలు, యాంగ్జైటీ, డిప్రెషన్, నిద్రమాత్రలు అధికంగా ఉంటున్నాయి.



యాంటీబయాటిక్స్ తరచూ వాడితే...

- సాధారణ మందులకు వ్యాధి తగ్గకపోతే డాక్టర్ యాంటీబయాటిక్స్ రాస్తారు. కానీ ప్రతి చిన్న వ్యాధికి మనమే వెళ్లి మందుల దుకాణంలో కొని వాడితే కొన్ని దుష్ప్రభావాలు ఉన్నాయి.
- దీనివల్ల కడుపులో ఎసిడిటీతో పాటు కొన్నిసార్లు అల్సర్లుగా మారే ప్రమాదం ఉంది.
- నిరంతరం వాడితే పెద్ద అనారోగ్య సమస్య వస్తే ఆ మాత్రలు పనిచేయకుండా పోతాయి.
- అతిగా వాడితే శరీరంలోని పొట్ట, పేగుల్లో రక్షణ వ్యవస్థగా ఉండే మంచి బ్యాక్టీరియా కూడా నశిస్తుంది
- శరీరంలో కణం, మ్యూకస్ పొరలు తీవ్రంగా దెబ్బతింటాయి
- శరీరంలో రక్షణ వ్యవస్థ శక్తిమంతంగా పనిచేయలేదు
- తెల్ల రక్తకణాలు నశించిపోతాయి
- ప్రధానంగా కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.
- శృంగారంలో శక్తిని పెంచే మాత్రలు డోసు ఎక్కువైతే గుండెపై ప్రభావం చూపి గుండె పోటు వచ్చే అవకాశం ఎక్కువ.

వైద్యుల సూచన లేకుండా వాడితే..

వైద్యుల సూచన లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు మందులను దుకాణాలకు వెళ్లి తెచ్చుకుని వాడితే అప్పటికి వ్యాధిలక్షణాలు తగ్గుతాయేమో గానీ తర్వాత దీర్ఘకాలంలో తీవ్ర దుష్పరిణామాలు వస్తాయి. ముఖ్యంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల శరీరంలోని మంచి బ్యాక్టీరియా కూడా నశిస్తుంది. ఈ మందులు ఎప్పుడు ఎలా వాడాలో వైద్యులు మాత్రమే సూచిస్తున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు ఎలా పడితే అలా వేసుకుంటే భవిష్యత్‌లో మళ్లీ వ్యాధి వచ్చినప్పుడు అవి పనిచేయకుండా పోతాయి. ఆ తర్వాత మరింత తీవ్రమైన యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. దీనివల్ల శరీరానికి డ్రగ్ రెసిస్టెన్సి ఏర్పడుతుంది. ఎక్కువగా యాంటీబయాటిక్స్, వైరస్ నివారిణులు, శృంగారంలో శక్తిని పెంచే మాత్రలు వాడటం వల్ల అవి గుండెపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పెయిన్ కిల్లర్స్, స్టిరాయిడ్స్ సైతం వాడితే అల్సర్స్, కిడ్నీ సమస్యలు వస్తాయి. పీరియడ్స్ రావడానికి, పీరియడ్స్ వాయిదా పడేందుకు వాడే మందులు సైతం వైద్యుల సూచన లేకుండా వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నొప్పి నివారణ మాత్రలు వాడితే కిడ్నీలపై ఎఫెక్ట్



సాధారణంగా ఎవ్వరైన నొప్పులు ఉంటే డాక్టర్‌ను కలవకుండా నేరుగా మందుల షాపునకు వెళ్లి మాత్రలు కొని వాడటం జరిగేదే. ఆ మాత్రలకు అలవాటు పడ్డ మనిషి తరచూ వాటినే మళ్లీ మళ్లీ కొని వాడుతూ కాలం వెళ్లదీస్తారు. వాస్తవానికి శరీరంలో ఏ నొప్పి ఎందుకు వచ్చింది, దానికి ఎలాంటి చికిత్స ఇవ్వాలనే విషయం డాక్టర్‌కు మాత్రమే తెలుస్తుంది. ప్రతి నొప్పికీ నొప్పి మాత్రలు వాడుతూ వెళితే క్రమంగా అది కిడ్నీపై ప్రభావం చూపిస్తాయి. కొన్ని రోజులకు కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్‌కు దారి తీస్తాయి. కొన్ని సార్లు ఈ పరిస్థితే ప్రాణాంతకం కావచ్చు. నొప్పి మాత్రలు అధికంగా వాడటం వల్ల కడుపులో పుండ్లు కూడా ఏర్పడేందుకు ఆస్కారం ఉంది.

–డాక్టర్ శివశంకర్‌రెడ్డి, యురాలజిస్టు, కర్నూలు

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు



జిల్లాలోని పలు మందుల దుకాణాల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇటీవల కాలంలో తరచూ మెడికల్ షాపులను తనిఖీ చేస్తున్నాం. ఎక్కడైనా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినట్లు తెలిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా టెన్షన్, డిప్రెషన్, నిద్రకు ఉపయోగించే మాత్రలతో పాటు శృంగారశక్తిని పెంచే మాత్రలు అసలు విక్రయించవద్దు. వీటి వల్ల కొందరు రోగులకు సరిపడక సైడ్‌ఎఫెక్ట్స్ వస్తున్నట్లు సమాచారం ఉంది.

–హరిహర తేజ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు

వైభవంగా వాదీంద్ర తీర్థుల ఆరాధన



వేడుకలను తిలకిస్తున్న భక్తులు



వాదీంద్ర తీర్థుల సామర్ల సేవలో పీఠాధిపతి

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి వాదీంద్ర తీర్థుల ఆరాధన వైభవంగా జరిగింది. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో కనుల పండువగా నిర్వహించారు. వాదీంద్ర తీర్థుల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఊంజల మంటపంలో వాదీంద్ర తీర్థుల చిత్ర పటానికి ప్రత్యేక పూజలు గావించి ఊంజల సేవా నిర్వహించారు. బంగారు రథం పై చిత్ర పటాన్ని కొలువుంచి పీఠాధిపతి హారతులు పట్టి రథయాత్రకు అంకురార్పణ పలికారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలు, అశేష భక్త జనుల మధ్య రథ యాత్ర కమనీయంగా జరిగింది.

నాటుసారా కేంద్రాలపై దాడులు విస్తృతం చేయండి

కర్నూలు: నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు విస్తృతం చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశించారు. జిల్లాలోని 7 సెబ్ స్టేషన్లు, చెక్‌పోస్టుల ఎస్‌హెచ్‌ఓలతో శనివారం ఏఈఎస్ వినోద్ కుమార్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులపై ఆయన సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన మార్చి 16 నుంచి జూన్ 6వ తేదీ వరకు నమోదైన కేసులపై స్టేషన్ల వారీగా ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న విషయంపై ఆరా తీశారు. గ్రేవ్ కేసులపై త్వరగా చార్జిషీట్లు వేయాలని సూచించారు. మద్యం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను జప్తు చేసి అపరాధ రుసుం వసూలు చేయాలని సూచించారు. మద్యం, నాటుసారా, గంజాయి రవాణా, విక్రయాలు చేస్తూ పట్టుబడిన కేసుల్లోని నిందితులపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

చెక్‌పోస్టు ఉద్యోగం భలే కిక్కు!

మద్యం పట్టుబడితే పండగే

- కేసుల నమోదు లేకుండా పంచాయితీలు
- బాటిళ్లు తీసుకొని రవాణాదారులను వదిలేస్తున్న వైనం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కర్నూలు: కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో సెబ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం రవాణా కాకుండా నిరోధించేందుకు పంచలింగాల క్రాస్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటైంది. గతంలో సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులతో పాటు అధిక సంఖ్యలో సిబ్బంది నిరంతరం వాహనాలు తనిఖీ చేస్తూ మద్యం అక్రమ రవాణాను కట్టడి చేశారు. ఎన్నికల సమయంలో కూడా ఈ చెక్‌పోస్టు వద్ద సివిల్, సెబ్ పోలీసులతో పాటు రవాణా, ఇతర శాఖల అధికారులతో కలిసి నిరంతరం వాహనాలు తనిఖీ చేపట్టారు. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత సివిల్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తమ విధులకు వెళ్లిపోవడంతో కేవలం సెబ్ పోలీసులు మాత్రమే చెక్‌పోస్టులో విధుల్లో ఉంటున్నారు. అక్కడ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు షిఫ్టులలో ఇక్కడ సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వల్ల కొంతమంది మాత్రమే ఉంటున్నారు. అక్కడ విధులు నిర్వహించే ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ప్రతిరోజూ పట్టుబడిన మద్యం బాటిళ్లను వారు ఉంటున్న గదుల్లో భద్రపరచి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కర్నూలుకు చెందిన గిరిబాబుతో పాటు మరో నలుగురు యువకులు శనివారం అలంపూర్‌కు వెళ్లి మద్యం సేవించి తిరిగి వచ్చేటప్పుడు కారులో రాయల్‌స్టాగ్ మద్యం బాటిళ్లను తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వాహనం తనిఖీ చేశారు. కారులో ఆరు రాయల్‌స్టాగ్ ఫుల్ బాటిళ్ల మద్యం పట్టుబడగా వాటిని నొక్కేసి కారును వదిలేశారు.

- అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుబడితే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి రవాణాదారులపై కేసు నమోదు చేయాల్సి ఉంది.
- అయితే కొంతకాలంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సెబ్ సిబ్బంది అక్రమ సంపాదనకు అలవాటు పడి చేతివాటం ప్రదర్శిస్తున్నారు.
- సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ కొంతకాలంగా సిబ్బంది పట్టుబడిన మద్యాన్ని రహస్య ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.
- ఈ విషయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌ను వివరణ కోరగా విధుల్లో ఉన్న సిబ్బంది తనిఖీల సందర్భంగా మద్యం నొక్కేసినట్లు విచారణలో బయటపడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అక్కడ విధులు నిర్వహించాల్సిన ఉన్నతాధికారుల పనితీరుపైనా విచారణ జరిపిస్తానని తెలిపారు.



అన్నదాతలకు దక్కని పంట రుణాలు

2024-25 సంవత్సరానికి ఖరారు కాని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

- పంట రుణాల పంపిణీకి ససేమిరా అంటున్న బ్యాంకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది మే నుంచే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ పనులు కూడా ము మ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు ఊపందుకున్నప్పటికీ రైతులకు చేయూత కరువైంది. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులు రైతులకు పంట రుణాలుగా పంపిణీ చేసే పరిమితిని జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఖరారు చేస్తుంది. దీనినే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌గా వ్యవహరిస్తారు. ఏటా ఆర్థిక సంవత్సరానికి ముందే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసేవారు. పంటల పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను జిల్లా సహకార కేంద్రబ్యాంకు టెక్నికల్ కమిటీ ఖరారు చేస్తుంది. 2024–25 సంవత్సరానికి సంబంధించి నాలుగైదు నెలల క్రితమే జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసి స్టేట్ లెవల్ బ్యాంకర్ కమిటీ ఆమోదానికి పంపింది. అక్కడ మార్పులు, చేర్పులతో ఆమోదం పొంది జిల్లాకు వచ్చే సరికి ఎన్నికల కోడ్ వచ్చింది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను జిల్లా కలెక్టర్ ఆమోదించిన తర్వాత బ్యాంకులకు పంపుతారు. బ్యాంకుల్లో ఉన్న నిధుల లభ్యతను బట్టి ఎకరాకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు పంపిణీ చేస్తారు. ఖరీఫ్ మొదలై ముమ్మరంగా విత్తనం పనులు జరుగుతున్నా.. ఈ సారి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు ఇంతవరకు ఆమోదం లభించకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌తో సంబంధం లేకుండా అరకొరగా పంట రుణాలు పంపిణీ చేస్తున్నప్పటికీ పలు బ్యాంకులు పంట రుణాల పంపిణీని పూర్తిగా విస్మరించాయి. మామూలుగా అయితే ఆర్థిక సంవత్సరం మొదలైన ఏప్రిల్ 1 నుంచే పంట రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టాల్సి ఉంది. ఎస్‌బీఐ, యూబీఐ, ఏపీజీబీ తదితర బ్యాంకులు పంట రుణాల పంపిణీపై దృష్టి సారించకపోవడం రైతులకు శాపంగా మారింది. దిక్కుతోచని రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రోజూ వర్షమే!



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజూ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ మండలాల్లో వర్షం పడింది. కర్నూలు జిల్లాలో 20 మండలాలు, నంద్యాల జిల్లాలో 14 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడటంతో రెండు జిల్లాల్లో వర్షాలు జోరందుకున్నాయి. జిల్లాలో అత్యధికంగా మంత్రాలయంలో 43.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా మొదటి పక్షంలోనే 130.1 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈ నేపథ్యంలో వర్షాధారం పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటి వరకు పత్తి 3,306 హెక్టార్లు, వేరుశనగ 929 హెక్టార్లు, కంది 50, ఆముదం 10, మిరప 65, ఉల్లి 25 హెక్టార్ల ప్రకారం సాగయింది.

మండలం	వర్షపాతం (మి.మీ.లో..)
నంద్యాల	29.2
చాగలమర్రి	27.2
ఆదోని	25.4
గోస్పాడు	22.4
ప్యాపిలి	22.4
కౌతాళం	22
ఉయ్యాలవాడ	20
కోడుమూరు	19.6

నంద్యాల జిల్లాలో..

జిల్లాలోని 14 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా రుద్రవరంలో 50.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా గత 15 రోజుల్లోనే 169.8 మి.మీ వర్షం కురిసింది.

క్లుప్తంగా

గుండెపోటుతో ఎంఈఓ మృతి


బాలనాయుడు (ఫైల్)

ఆలూరు: చిప్పగిరి మండల విద్యాశాఖఅధికారి -2 బోయ బాలనాయుడు(55) శనివారం గుండె పోటుతో మృతిచెందారు. ఆళ్లగడ్డకు చెందిన బాలనాయుడు బేతంచెర్ల జెడ్పీహైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ ఏడాది క్రితం పదోన్నతి పొంది చిప్పగిరి ఎంఈఓ-2గా వచ్చారు. బళ్లారి జిల్లా కేంద్రంలో భార్య భార్య కళావతి(కుమారి)తో కలిసి కాపురముంటూ రోజూ చిప్పగిరికి విధులకు హాజరయ్యేవారు. అందులో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరుతుండగా ఛాతీలో నొప్పి వచ్చింది. విషయం భార్యకు చెప్పడంతో ఆమె చికిత్స నిమిత్తం ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బోయ జూటూరు మహేమలత, ఎంఈఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ బరకత్అహ్మద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

విలువలతో కూడిన వైద్యం చేయండి


వైద్య విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): విలువలతో కూడిన వైద్యం చేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ సూచించారు. శనివారం కళాశాలలోని లెక్చర్ గ్యాలరీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లకు ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్యులు తమ వైద్యంలో ప్రతి పనికి రికార్డు మెయింటెన్ చేయాలని, ఇబ్బందులు ఏర్పడినప్పుడు ఆ రికార్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యులు రోగుల పట్ల సానుభూతి, కరుణ చూపాలన్నారు. రోగులు డాక్టర్‌పై ఎంతో నమ్మకంతో తమ సమస్యలు చెప్పుకుంటారని, వాటిని సావధానంగా వినాలన్నారు. ప్రతి వైద్యుడు ఎన్ఎంసీ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అప్పుడే వైద్యులకు సమాజంలో గౌరవం, రక్షణ లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మెడిసిన్ ఇన్‌చార్జ్ హెచ్ఓడీ డాక్టర్ సింధియా శుభప్రద పాల్గొన్నారు.

నల్లమల సొగసు చూడతరమా!


ఘాట్ రోడ్డులో ఇరువైపులా ఎత్తైన చెట్లు


పచ్చని అందాల నల్లమలపై మేఘాలు

ఆకు పచ్చని అడవి అందాల నడుమ ప్రయాణం ఓ అద్భుతం. ఓ వైపు ఎత్తైన కొండలు.. మరో వైపు ఒంపులు తిరిగిన నల్లని తారు రోడ్డు.. కళ్లు తిరిగే లోతైన లోయలు.. ఆకు పచ్చని కొండలను తాకుతూ వెళ్లే తెల్లటి మేఘాలు.. ఈ రమణీయ దృశ్యాలు నల్లమల సొంతం. ఆత్మకూరు నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో నల్లమల అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం పచ్చని శోభను సంతరించుకుని కళకళలాడుతుండటంతో వాహనదారులు ఆస్వాదిస్తున్నారు.
– ఆత్మకూరు


ఆత్మకూరు-బైర్లూటి మధ్య ఘాట్‌లో పచ్చబడిన నల్లమల

శ్రావణం వరకు ఆగాల్సిందే!

- ఏప్రిల్ 28 నుంచి నిలిచిన శుభకార్యాలు
- వరుసగా శుక్ర, గురు మౌఢ్యమిలు
- ఆగష్టు 7 తరువాతే వివాహాలు, గృహ ప్రవేశాలు



గోస్పాడు: ప్రతి ఒక్కరూ ఏ శుభకార్యం నిర్వహించుకోవాలన్నా ముందుగా మంచి ముహూర్తం నిర్ణయించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది ఆగస్టు ఐదో తేదీ వరకూ వివాహాలు, ఇతర శుభకార్యాలకు కొంతమేరకు బ్రేక్ పడింది. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి వరుసగా మూఢమిలు రావడంతో రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు నిలిచిపోయాయి. క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ చైత్ర మాసం వరకు నడిచాయి. ఏప్రిల్ 28వ తేదీ చైత్ర చవితి ఆదివారం నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకూ ఆషాఢ శుద్ధ తదియ వరకు శుక్ర మౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. అలాగే మే 7 నుంచి చైత్ర బహుళ చతుర్దశి మంగళవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకు గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా వివాహాలకు ఆటంకం ఏర్పడింది. మరో వైపు జూలై 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభమై ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు నిర్వహించరు. ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలు, ఏ ఇతర శుభకార్యాలు జరిగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటివి మౌఢ్యమిలోని మంచి రోజుల్లో చేసుకోవచ్చునని పండితులు సూచిస్తున్నారు. అలాగే సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసం కావడంతో ఆ సమయంలో కూడా వివాహాల ముహూర్తాలు ఉండవని చెబుతున్నారు.

శ్రావణ మాసంలోనే....

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 3వ తేదీ వరకూ కొనసాగుతోంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆగస్టు ఏడో తేదీ నుంచి 28 వరకూ ముహూర్తాలు ఉన్నాయి. వాటిలో 12, 13, 19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్నీ రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఉపాధికి దెబ్బ..

గత రెండు నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, పూలు, డెకరేషన్ లైటింగ్, కూరగాయలు, కిరాణం, వస్త్ర, బంగారు, వెండి ఆభరణాలు, సేమియానాలు, హోటళ్లు, లాడ్జిలతోపాటు సాంస్కృతిక కళాకారులకు పని లేదు. మరి ఎంతోమంది రోజువారి కూలీలకు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

శ్రావణంలో దివ్యమైన ముహూర్తాలు



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు నిలిచిపోయాయి. ఏప్రిల్ నెల చివరి నుంచి వివాహాలకు కొంత కాలం ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగష్టు 7 నుంచి 28 వరకు నాలుగైదు రోజుల మినహా దివ్యమైన ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్‌లో భాద్రపద మాసం శూన్యమాసం కావడంతో తిరిగి వివాహ ముహూర్తాలుండవు.
– సుధీంద్రాచార్యులు, అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

ఇద్దరు మైనర్ల దుర్మరణం

- కంటైనర్ లారీ కింద పడటంతో మృతదేహాలు నుజ్జునుజ్జు


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని మంత్రాలయం రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు దుర్మరణం చెందారు. వారిపై కంటైనర్ లారీ ఎక్కి కొంత దూరం లాక్కెళ్లడంతో ఇద్దరి మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి చెందిన మాల మునిస్వామి, పార్వతి దంపతుల చిన్న కుమారుడు శివ(15) పదవ తరగతి పాసై కాలేజీ చేరే ప్రయత్నంలో ఉన్నాడు. అలాగే నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన మాల నాగేంద్ర, లక్ష్మి దంపతులు హాలహర్వి నుంచి ఎమ్మిగనూరుకు వచ్చి కోసిగి రోడ్డులో నివాసముంటున్నారు. వీరి పెద్ద కుమారుడు గురుస్వామి(16) బేకరి దుకాణంలో పనిచేస్తున్నాడు. వీరి రెండు కుటుంబాలకు బంధుత్వం ఉంది. శనివారం గురుస్వామి, శివ మోటార్ బైక్‌పై మార్కెట్ యార్డ్ రోడ్డుకు బయలుదేరారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపానికి చేరుకోగానే మహారాష్ట్రకు చెందిన కంటైనర్ లారీ మంత్రాలయం వైపు వెళ్తూ బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో వెనుక భాగం బైక్ హ్యాండిల్‌కు తాకింది. దీంతో బైక్ అదుపుతప్పి పక్కకు పడిపోగా మైనర్లిద్దరూ కంటైనర్ లారీ కింద పడిపోయారు. వెనుక టైర్లు ఎక్కి కొంచెం దూరం లాక్కెళ్లడంతో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయి విడిపోయాయి. పట్టణ ఎస్ఐ రమేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాలను చూసి గుండెలు పగిలేలా రోదించారు. అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మృతులు శివ, గురుస్వామి (ఫైల్)

పోలీసుల అదుపులో మోసగాడు

డోన్ టౌన్: పెద్ద పెద్ద రాజకీయ నాయకులతో తనకు పరిచయం ఉందంటూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్న మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డోన్ మండలం కమలాపురం గ్రామానికి చెందిన మధుసూదన్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులతో, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులతో దిగిన ఫొటోలను చూపి పలువురి వద్ద వివిధ పనులు చేసిపెడుతానంటూ పెద్ద మొత్తంలో వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలువురు ఉద్యోగుల నుంచి కూడా బదిలీల పేరుతో పెద్ద మొత్తంలో వసూళ్లు చేసినట్లు తెలిసింది. కూరగాయల మార్కెట్‌లో రెండు దుకాణాలు, ప్రభుత్వ ఇంటి నివాస స్థలాలు ఇప్పిస్తానని చెప్పి దాదాపు రూ.5 లక్షలు తన నుంచి వసూలు చేసి మోసం చేశాడని పట్టణానికి చెందిన రైస్ మిల్లు రఫి పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. దీంతో మధుసూదన్ వసూళ్ల దందా ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. బాధితుని ఫిర్యాదు మేరకు డోన్ పట్టణ పోలీసులు మోసగాడిని అదుపులోకి తీసుకోని విచారణ చేస్తున్నారు.

పీఆర్‌లో బదిలీల గుబులు

- కర్నూలుకు వచ్చేందుకు పలువురి ప్రయత్నాలు


పీఆర్ ఎస్ఈ కార్యాలయం (విశ్వేశ్వరయ్య భవన్)

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో బదిలీలపై విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం వల్ల పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఉద్యోగుల బదిలీలు తప్పనిసరి అనే ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు కొందరు ప్రయత్నం చేస్తుండగా, మరికొందరు తమకు అనుకూలమైన ప్రాంతానికి బదిలీపై వచ్చేందుకు దారులు వెతుక్కుంటున్నారు. కాగా పీఆర్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ నెలాఖరుకు పర్యవేక్షక ఇంజినీరు కే.సుబ్రమణ్యం, ఆదోని ఈఈ ఏ వెంకటప్రసాద్‌తో పాటు ఒకరిద్దరు డీఈఈ, ఏఈలు పదవీ విరమణ చేయనున్నారు. ఎస్ఈ పోస్టును పదోన్నతుల్లో భాగంగా భర్తీ చేసే అవకాశాలున్నాయి. ఇక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీరో సర్వీసును అమలు చేస్తే, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాలుగు ఈఈ పోస్టుల్లోకి వచ్చేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని ఈఈ పోస్టు క్లియర్ వెకేన్సీ అయినా, కర్నూలు పీఆర్, నంద్యాల పీఆర్, పీఐయూ ఈఈ పోస్టులకు ఇప్పటికే పలువురు కర్చీఫ్ వేసినట్లు తెలుస్తోంది. గతంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో డీఈఈలుగా విధులు నిర్వహించిన ఐదుగురు ఈఈలుగా పదోన్నతిపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారిలో సుబ్బరాజు (పీఆర్ నెల్లూరు), కేవి సుధాకర్‌గౌడ్ (మెడికల్ ఇంజినీరింగ్, నెల్లూరు), మల్లికార్జునమూర్తి (పీఆర్ క్వాలిటీ కంట్రోల్, అనంతపురం), జీ మల్లికార్జున (పీఆర్, కాకినాడ), వైసీ సుబ్బరాయుడు (పీఆర్ పల్నాడు) ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు ఈఈలు కర్నూలుకు వచ్చేందుకు రాజకీయంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఈఈలు కూడా తమ స్థానాలను పదిలం చేసుకునే ప్రయత్నాలను షురూ చేసినట్లు సమాచారం. కాగా బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే జీఓలో సొంత జిల్లా ప్రస్తావన వస్తే, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురిలో ముగ్గురు, ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురిలో ఇద్దరు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. జీఓ విడుదలైతే బదిలీల ప్రయత్నాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏదిఏమైనా ఈ నెలాఖరుకు పలువురు ఇంజినీర్లకు స్థాన చలనం తప్పదనే ప్రచారాలు జోరందుకున్నాయి.

మా కూతురిని వెతికిపెట్టండి

- బాలిక తల్లిదండ్రుల వేడుకోలు


స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న బాలిక తల్లిదండ్రులు

గోనెగండ్ల: తమ కూతురు కనిపించకుండా పోయి 56 రోజులైనా జాడ లేదని, దయచేసి వెతికిపెట్టాలని మండల కేంద్రానికి చెందిన రూపేంద్రరెడ్డి, రామేశ్వరమ్మ దంపతులు పోలీసులను వేడుకున్నారు. ఏప్రిల్ 21న కూతురు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఆచూకీ కనిపెట్టకపోవడంతో దంపతులు శనివారం స్టేషన్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే తమ కూతురిని బేతంచర్ల మండలం శంకలాపురం గ్రామానికి చెందిన మధు అనే యువకుడు మాయమాటలు చెప్పి తీసుకువెళ్లినట్లు తెలిసిందన్నారు. ఇదే విషయాన్ని ఏప్రిల్ 21న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసుకుని, పోలీసులు చేతులు దులిపేసుకున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసులు తమ కూతురి జాడ కనిపెట్టి, తమకు దక్కేలా చేయాలని, లేనియెడలా తమకు ఆత్మహత్యే శరణ్యమని వారు తెలిపారు. ఇదే విషయమై సీఐ రామకృష్ణయ్యను ఆరా తీయగా బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామన్నారు. బాలిక, నిందితుడి సెల్‌ఫోన్లు కూడా ట్రేస్ కావడం లేదన్నారు.అయినా త్వరలోనే కేసును ఛేదిస్తామన్నారు.

లక్ష్య సాధనే ధ్యేయంగా శ్రమించాలి

- ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్


వక్తతో ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్, తదితరులు

కర్నూలు కల్చరల్: లక్ష్య సాధనే ధ్యేయంగా సరైన మార్గంలో శ్రమిస్తే ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం వర్సిటీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్స్ ఇన్ మేనేజ్‌మెంట్' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం విషయ అవగాహన చేసుకుంటూ సందేహాలను నివృత్తి చేసుకుంటూ పాఠ్యాంశాలను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రధాన వక్తగా హాజరైన లక్నో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.వెంకటరమణయ్య మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్తులో రానున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు ఆత్మన్యూనతా భావాన్ని వీడి గొప్ప ఆశయాలను ఏర్పరుచుకొని వాటిని సఫలం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె. నాయక్, ఎంబీఏ హెచ్ఓడీ ప్రొఫెసర్ సి.విశ్వనాథ రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరి ప్రసాద్‌రెడ్డి, ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో నివాసముంటున్న బోయ మహేష్ భార్య రాధాతులసి (20) ఆత్మహత్య చేసుకుంది. వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాధాకృష్ణ, హైమావతిల కూతురు రాధాతులసిని రెండేళ్ల క్రితం బోయ మహేష్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. మహేష్ భార్య రాధాతులసితో కలసి గ్రౌండ్ ఫ్లోర్‌లో, తల్లిదండ్రులు పైఅంతస్తులో వేర్వేరుగా నివాసముంటున్నారు. ఈనెల 14న కుమారుని మొదటి పుట్టిన రోజు వేడుకకు తల్లిదండ్రులను కూడా పిలిచి జరుపుకోవాలని మహేష్ సూచించగా భార్య అందుకు అంగీకరించలేదు. అయినప్పటికీ మహేష్ తన తల్లిదండ్రుల సమక్షంలో కుమారుని పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ విషయంలో తీవ్ర మనస్తాపానికి గురైన రాధాతులసి అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆలస్యంగా గుర్తించి ఉరి నుంచి తప్పించేసరికే ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.